ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 9 జూలై 2024



కొల్లిపర ఇసుక లోడింగ్ స్టాక్ పాయింట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్, ఇతర అధికారులు

కష్టజీవుల కళ్లలో.. ఆనందం



కుదేలైపోయిన నిర్మాణరంగానికి తిరిగి ప్రాణం పోసేందుకు కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైసీపీ సర్కారులో బంగారం కంటే ఖరీదైపోయిన ఇసుకను ప్రజలకు మళ్లీ ఉచితంగా ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అధికారం చేపట్టిన నెల రోజుల్లోపే కొత్త ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసింది. జిల్లాలోని పలు స్టాక్ పాయింట్లలో అందుబాటులో వున్న ఇసుకను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఐదేళ్లుగా నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న ఇసుక సంక్షోభానికి పరిష్కారం లభించినట్లయింది. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక విధానంతో నిర్మాణ రంగం గాడిన పడి, నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు తిరిగి లభిస్తాయన్న ఆశ కష్టజీవుల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మికులు మనస్ఫూర్తిగా స్వాగతించడంతో పాటు, హర్షం కూడా వ్యక్తం చేస్తున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయని సంబరాలు చేసుకుంటున్నారు.

- ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగానికి ఊతం!
- వైసీపీ ప్రభుత్వ ఇసుక దోపిడీతో కార్మికుల అగచాట్లు
- యజమానులను నిలువుదోపిడీ చేసిన బ్లాక్ మార్కెటింగ్
- ఐదేళ్లుగా పనులు కోల్పోయి అర్ధాకలితో బతికిన నిర్మాణ కూలీలు
- ఉచిత ఇసుక రావడంతో నిర్మాణ రంగంలో కదలిక
- జిల్లాలో 6 లక్షల మంది నిర్మాణ కార్మికులకు జీవనోపాధి పునరుద్ధరణ

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఇసుక దోపిడీ విధానం కారణంగా ఘోరంగా నష్టపోయిన రంగా ల్లో భవన నిర్మాణ రంగం ఒకటి. 2014- 19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన ఉచిత ఇసుక పాలసీని రద్దుచేసిన గత వైసీపీ ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీ పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడడంతో రాష్ట్రంలో నిర్మాణరంగం కుదేలైపోయింది. ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోవడంతో ఇటు యజమానులు, అటు కాంట్రాక్టర్లు ఎంతగానో నష్టపోయారు. కానీ అంతకు మిం చిన స్థాయిలో కష్టజీవులైన నిర్మాణ కార్మికులు కష్టాలపా లయ్యారు. కాంట్రాక్టర్లు, యజమానులకు ఆర్థికంగా భారం పెరగగా, నిర్మాణ కార్మికులకు ఉపాధే లేకుండా పోయింది. పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా ఒక రోజో.. ఒక నెలో.. లేక ఒక ఏడాదో కాదు.. ఏకంగా ఐదేళ్లపాటు నిర్మాణ కార్మికులు చేసేందుకు పనిలేక, తినేం దుకు తిండిలేక నిత్యం నరకం అనుభవించారు. అలాంటి వారికి కొత్త ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ తిరిగి ప్రాణం పోసింది.

● అందరికీ అందుబాటులో ఇసుక..

ఎగుమతి, దిగుమతి, రవాణాతో కలిపి రూ. 9, 10 వేలకు దొరికే 18 టన్నుల లారీ ఇసుక వైసీపీ ప్రభుత్వ కొత్త ఇసుక విధానం కారణంగా రూ. 25 నుంచి 30 వేల వరకూ వెళ్లింది. వ్యాపారం మొత్తం వైసీపీ నేతలు, ఇసుక మాఫియా ఆధీనంలో ఉండడంతో సామాన్యులకు ఎవరికీ ఆన్‌లైన్ బుకింగ్‌లో ఇసుక దొరకలేదు. దీంతో సామాన్యు లు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్లాక్ మార్కెట్లో ఒక్కో లారీ ఇసుక రూ. 40 నుంచి 45వేల రూపాయల వరకూ వసూలు చేశారు. అయినా అవసరా లకు తగిన స్థాయిలో ఇసుక దొరకలేదు. ఫలితంగా చాలా మంది నిర్మాణాలు ఆపేసుకున్నారు. కాగా ప్రస్తుత కూట మి ప్రభుత్వం టన్ను ఇసుక రూ. 250 లోడింగ్ చార్జీతో అందుబాటులోకి రావడంతో మళ్లీ విని యోగదారుల్లో ఆనందం కనిపిస్తోంది. మొత్తంగా ఎగు మతి, దిగుమతి కూలీలతో కలిపి లారీ ఇసుక రూ. 10 వేల లోపుకే అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వినియోగదారులందరికీ ఇసుక అందు బాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం, అధికా రులు కృషి చేస్తున్నారు. తొలుత స్టాక్ పాయింట్లలో వున్న వేలాది మెట్రిక్ టన్నుల ఇసుకను వినియోగదారులకు అందించ నున్నారు. వర్షాకాలం కావడంతో అందుబాటులో వున్న ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక సేకరించేందుకు సమ స్యలు న్నాయి. ఆ రీత్యా మూడు జిల్లాల్లో వర్షాకాలంలో కూడా అందుబాటులో వుండే ఇసుక రీచ్‌లపై అధికారులు కస రత్తు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నుల ఇసు క మాత్రమే అందించనున్నారు. కాగా తొలిరోజు సామా న్య వినియోగదారులకు ఎవరికీ ఇసుక అందలేదన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ముందు వరుసలో ఉండడంతో సామాన్యులు వెనకబడి పోయారని, వారికి కూడా అందేలా చర్యలు తీసుకోవా లని వినియోగ దారులు కోరుతున్నారు.

● ఆరు లక్షల మందికి ఉపాధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు వున్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో వారంతా పనులు కోల్పోయారు. 2020లో కరోనా కష్టకాలంలో వారు నరకం చూశారు. ఆ తరువాత పనులు దొరుకుతాయని ఆశించినా పనులు దొరకలేదు. ప్రభు త్వం ఇసుక ధర పెంచడంతో మూడు జిల్లాల్లో నిర్మాణాలు ఎక్కడివక్కడ ఆగిపోయా యి. అమరావతి నిర్మాణం కూడా ఆగిపోవడంతో వారి పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయార యింది. పనుల కోసం కార్మిక అడ్డాల్లో వందలాది మంది కార్మికులు ఉదయం 6 గం టల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ వేచి చూసినా పనులు దొరకని దీన స్థితి ఏర్పడింది. వారం లో ఒక్కరోజు కూడా పని దొరకక పస్తులున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిం చాయి. అనేకమంది కార్మికులు ఆత్మ హత్యలకు కూడా పాల్పడిన ఘటనలు చోటు చేసు కున్నాయి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐదేళ్ల క్రితం విరమించుకున్న పలు వురు తిరిగి నిర్మాణ పనులు చేప ట్టేందుకు సిద్ధమయ్యారు. తద్వారా నిర్మాణ రంగంలో కొత్త ఊపు కనిపిస్తోంది. తద్వారా కష్ట జీవులకు పని భద్రత లభించినట్లయింది. దీంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తోంది.



కొల్లిపర స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్

ఎలా తీసుకోవాలి

నిబంధనల ప్రకారం వినియోగదారుడు తన ఆధార్, మొబైల్ నెంబరు, అన్‌లోడింగ్ చిరునామా, వాహన నెంబరు వంటివి స్టాక్‌యార్డు సిబ్బందికి అందించాలి. అవన్నీ నమోదు చేసిన తర్వాత విక్రయ రశీదు/ఇన్‌వాయిస్‌ని ఇస్తారు. డిశ్పాచ్ పర్మిట్లని సెక్యూర్డ్ స్టేషనరీలో జారీ చేయాల్సి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ని స్కానింగ్ చేసి నగదు చెల్లిస్తేనే అనుమతులు మంజూరు చేస్తారు. కాగా కొంతమంది లారీ యజమానులు/డ్రైవర్లు సోమవారం రీచ్‌ల వద్దకు ఎవరెవరివో ఆధార్ నెంబర్లు తీసుకొని ఇసుక లోడింగ్ చేయాలని వచ్చారు. ఒక్కో స్టాక్‌యార్డులో 100కు పైగా వాహనాలు బారులుదీరి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉచిత ఇసుక విధానం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వినియోగదారుడు తప్పనిసరిగా స్టాక్‌యార్డు వద్దకు వచ్చి అన్ని వివరాలు అందజేసేలా నిబంధన పెట్టాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్ర చరిత్రలోనే సువర్ణాధ్యాయం



మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూలై 8 : ఉచిత ఇసుకతో ప్రతి పేద వాడి ఇంటా పండుగ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. పారదర్శక విధానంతో నాణ్యమైన ఇసుక పంపిణీ టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. ఇసుక మాఫియాతో జగన్‌రెడ్డి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఇసుక కుంభకోణం ద్వారా వైసీపీ నాయకులు సుమారు 50వేల కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల రూపాయలు అయితే అందులో 3లక్షల రూపాయలు ఇసుక కొనుగోలుకు ఖర్చు చేశారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారన్నారు. కొత్తగా వచ్చిన ఇసుక పాలసీలో నిర్వహణ ఖర్చుల కోసం నామినల్‌గా ధరలు, రవాణా, లోడింగ్ చార్జీలు వసూలు చేస్తారన్నారు. లక్షల మంది భవన నిర్మాణ, అనుబంధ రంగాలకు ఊతమిచ్చేలా ఉచిత ఇసుక పథకం అమలు చేసిన సీఎం చంద్రబాబుకు మంత్రి గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ఆరు చోట్ల నుంచి ఇసుక

నరసరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో తొలి రోజు ఒక చోట మాత్రమే ఇసుక విక్రయాలను ప్రారంభించారు. మంగళ వారం నుంచి పూర్తి స్థాయిలో ఇసుక సరఫరా ప్రారంభం కానున్నది. అమరావతి మండలం వైకుంఠపురం స్టాక్ యార్డు నుంచి సాయంత్రం ఇసుక సరఫరాను ప్రారంభించారు. 24 టన్నులను ఇక్కడ విక్రయించారు. వినుకొండ, రాజుపాలెం మండలం కొండమోడు, అచ్చంపేట మండలం కోనూరు, మాదిపాడు, కొతపల్లి ఈ ఐదు యార్డుల నుంచి ఇసుక సరఫరా తొలి రోజు ప్రారంభించలేదు. ఇందుకు సంబంధించి విధివిదాలను మైనిం గ్ శాఖ ప్రకటించింది. సుమారు 2,39,900 మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉంది . ఇసుక అమ్మకం ధరను నిర్ణయించారు. లోడింగ్ చార్జీలు టన్నుకు రూ 30. అడ్మిన్ చార్జీలు టన్నుకు రూ 30, సీనరేజ్ చార్జీలు టన్నుకు రూ 88. రవాణా చార్జీ టన్నుకు రూ 490. జీఎస్‌టీ 18 శాతం చెల్లించాలి. వైకుంఠపురం, కోనూరు, మాదిపాడు, కొతపల్లి స్టాక్ యార్డు నుంచి టన్నుకు రూ. 191.52 చెల్లించాలి. రవాణా చార్జీలు లేకుండా ఇక టన్నుకు రూ. 192 డిజిటల్ పేమెంట్ ద్వారా స్టాక్ యార్డు నుంచి నేరుగా ఇసుక పొందే విధంగా మైనింగ్ శాఖ ఏర్పాట్లు చేసింది. కొండమోడు యార్డ్ నుంచి రవాణా చార్జీలతో కలిసి టన్నుకు రూ. 563.22, వినుకొండ యార్డ్ నుంచి టన్నుకు రూ. 792.43 చెల్లించాలి. జిల్లాలో వైకుంఠపురంలో రెండు, ధరణికోట, దిడుగు, చామర్రు, మాదిపాడులో డీ సిల్టేషన్ పాయింట్‌లు ఉన్నాయి. వీటిలో దాదాపు 3,59,000 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని మైనింగ్ శాఖ ప్రకటించింది. ఇక్కడ నుంచి టన్నుకు రూ 200 అదనంగా బోట్స్ మెన్ సొసైటీకి ఉత్పాదక ధర కింద చెల్లించి ఇసుక పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. రోజుకు ఒకరికి 20 టన్నులు మాత్రమే ఇసుక సరఫరా చేస్తారు. ఓఎంఈపీఎస్ పోర్టల్‌లో ఇసుక లభ్యత వివరాలు స్టాక్ యార్డుల వారీగా అం దుబాటులో ఉంచారు. ఇసుక సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబరు 18004256029కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు.



● లింగాయపాలెం వద్ద ఇసుక నిల్వలు

ఇసుక రవాణా ఛార్జీల ఖరారు

- లారీ/ట్రాక్టర్ యజమానులు డీఎంజీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి
- నిర్ణీత ఛార్జీలకు మించి వసూలు చేస్తే కఠిన చర్యలు

గుంటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధా నంలో భాగంగా గుంటూరు జిల్లాలో రవాణ ఛార్జీలను అధికార యంత్రాంగం ఖరారు చేసింది. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు రవాణ శాఖ ఉప కమిషనర్ కరీం తన కార్యాల యంలో ఇసుక రవాణ చేసే లారీలు/ట్రాక్టర్ల యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విధానాన్ని వారికి తెలియజేసి సాధ్యమైనంత తక్కువ ఛార్జీలనే ప్రజల వద్ద వసూలు చేయాలని ఆదేశించారు. చర్చల అనంతరం ఆరు టైర్లు, 10 టైర్లు, 12 టైర్లు లారీలు, ట్రాక్టర్‌కు శ్లాబుల వారీగా ఛార్జీలను ఖరారు చేశారు. 60 కిలోమీటర్ల దూరం వరకు శ్లాబుల విధానం, ఆ తర్వాత నుంచి కిలోమీటర్‌కు రూ. 7.50 నుంచి రూ. 12 వరకు వాహనాన్ని బట్టి వసూలు చేసు కొనే అవకాశాన్ని కల్పించారు.

15 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 2 వేలు, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 3 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 4 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 1,500 వసూలు చేసుకోవచ్చు.

16 నుంచి 30 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నులు)కి రూ. 3,500, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి రూ. 5 వేలు, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 6 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 2,400 వసూలు చేసుకోవచ్చు.

31 నుంచి 45 కిలోమీటర్ల దూరం వరకు:
● 31 నుంచి 45 కిలో మీటర్ల దూరం వరకు: ఆరు టైర్ల లారీ (10 టన్ను ల)కి రూ. 4,500, 10 టైర్ల లారీ (18 టన్నుల)కి రూ. 7,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 8 వేలు, ట్రాక్టర్ (5 టన్నులు)కు రూ. 3,000 వసూలు చేసుకోవచ్చు.

46 నుంచి 60 కిలోమీటర్ల దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ(10 టన్నుల)కి రూ. 5,500, 10 టైర్ల లారీ(18 ట న్నుల)కి రూ. 8,500, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి రూ. 10 వేలు, ట్రాక్టర్(5 టన్నులు)కు రూ. 3,500 వసూలు చేసుకోవచ్చు.

60 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం వరకు:
● ఆరు టైర్ల లారీ (10 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 9, 10 టైర్ల లారీ(18 టన్నుల)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, 12 టైర్ల లారీ(21 టన్నులు)కి టన్నుకు ప్రతీ కిలోమీటర్‌కి రూ. 7.50, ట్రాక్టర్(5 టన్నులు)కు టన్నుకు ప్రతీ కిలో మీటర్‌కు రూ. 12 వసూలు చేసుకోవచ్చు.

లారీ ఇసుక రూ. 10వేలకే వస్తుంది



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానంతో లారీ ఇసుక రూ. 9 నుంచి 10 వేలకే వస్తుంది. గతంలో వేల రూపాయలు పెట్టిన దొరకని ఇసుక అందరికీ అందుబాటులోకి వస్తే పనులు సాగుతాయి. కార్మికులకు చేతినిండా పని వుంటుంది. తద్వారా ఆకలి, పస్తులు తప్పుతాయి.

- దీవెనరావు, సీఐటీయూ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం హర్ష ణీయం. గత ప్రభుత్వంలో ఇసుక అందు బాటులో లేక, పనులు కోల్పోయి, కుటుంబాలు గడవక అనేక మంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. చీకటి రోజులు తిప్పికొడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మి కులకు వరంగా మారుతుంది.

- దండా లక్ష్మీనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సామాన్యులకు అందుబాటులోకి తేవాలి



తొలిరోజు నాకు ఇసుక అందలేదు. పెద్ద పెద్ద కంపెనీలకే అందింది. దీనిపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సామా న్య వినియోగదారులకు అందేలా చేయాలి. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించాలి. బ్లాక్ మార్కెట్లో గోతం ఇసుక రూ. 150 అమ్ముతున్నారు. దాన్ని అరికట్టాలి.

- గోనె లూథర్‌పాల్, గుంటూరు సుందరయ్యనగర్ వాసి



● కొల్లిపర వద్ద ఇసుక లోడింగ్ కోసం బారులు తీరిన లారీలు

రూ.18.88 కోట్ల ఎరువులు, పురుగు మందుల అమ్మకాలు నిలిపివేత

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



పురుగుమందుల కంపెనీలలో తనిఖీలు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బృందాలు

గుంటూరు సిటీ, జూలై 8: జిల్లాలోని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కంపెనీలు, షాపులపై రాష్ట్రస్థాయి తనిఖీ బృందాల దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోమవారం గుంటూరు అర్బన్‌తో పాటు, వట్టిచెరుకూరు మండలంలో దాడులు నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.18.88కోట్ల విలువైన పురుగు మందులు, ఎరువులు, బయోఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశామని తెలిపారు. అదేవిధంగా అనుమతి లేని రూ.12.44 లక్షల విలువైన పురుగుమందులు స్టాక్ చేసిన కారణంగా వాటిని జప్తు చేసినట్లు తెలిపారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని ఆయన తెలిపారు. దాడుల్లో ఏడీఏలు నాగేశ్వరరావు, బాలాజీ నాయక్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు శ్రీనివాసరెడ్డి, మాణిక్యరావు, ఏఓలు బీ గౌతమ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పనులు.. పాట్లు

నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫారం నిర్మాణ పనులు



- సా..గుతున్న ఆధునికీకరణ
- నరసరావుపేటలో రైల్వేస్టేషన్‌పై శీతకన్ను
- రైల్వే ఫ్లాట్‌ఫారంపై కనీస వసతులు కరువు
- నిలువనీడ లేక అల్లాడుతున్న ప్రయాణికులు
- వృద్ధులు, దివ్యాంగులకు ప్రాణసంకటంగా రైలెక్కడం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిలువ నీడ లేదు.. తాగునీరు ఉండదు.. రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారంతా అధ్వానం.. అపరిశుభ్రత.. వర్షం పడిందంటే ప్రయాణికులకు నరకం.. ఇదీ జిల్లా కేంద్రమైన నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో పరిస్థితి. రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు ఉన్నా.. కనీస వసతులు లేకున్నా.. ఇప్పటికే చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నా రైల్వే ఉన్నతాధికారులకు పట్టడంలేదు. మొత్తంమీద నరసరావుపేట రైల్వేస్టేషన్‌పై అధికారులు శీతకన్నేశారని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతుల కల్పనను రైల్వేశాఖ మరిచిందని విమర్శిస్తున్నారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణించే వారి సంఖ్య నానాటికి పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో వసతులు లేవు. ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు సౌకర్యాలు, వసతులు కల్పించాల్సిన సదరు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైల్వే స్టేషన్‌లో చేపట్టిన ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల తరబడి పనులను సాగదీస్తున్నారు. ఫ్లాట్‌ఫారాలపై పనులు పూర్తి కాక పోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఒకటో నెంబరు ఫ్లాట్‌ఫాంను వినియోగించడంలేదు. రైళ్లన్నీ రెండో ఫ్లాట్‌ఫాంపైకి వస్తున్నాయి. మొదటి ఫ్లాట్‌ఫాం నుంచి రెండో ఫ్లాట్‌ఫాం పైకి దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్యులు, గుండెజబ్బులు ఉన్నవారు ఫుట్‌బ్రిడ్జిని వినియోగించాల్సి వస్తుంది. దీంతో వారు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లిఫ్ట్ నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. రెండో ఫ్లాట్‌ఫాంకు పైకప్పు కోసం చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో నిలువనీడ లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. రైలు కోసం వేచి ఉండే ప్రయాణికులు కూర్చొనేందుకు పూర్తి స్థాయిలో బల్లలు కూడా లేవు. రైలు వచ్చిన సమయంలో వర్షం కురిస్తే ప్రయాణికులు పూర్తిగా తడిసి ముద్దవుతున్నారు. కనీసం రెండో ఫ్లాట్‌ఫాం బదులు ఒకటో నెంబరు ఫ్లాట్‌ఫాం వినియోగిస్తే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పుతాయి. ఈ ఫ్లాట్‌ఫాంకు పైకప్పు ఉంది. నీడ ఉండటంతో పాటు వర్షం కురిసినా రక్షణ ఉంటుంది. వృద్ధులు, రోగులు, దివ్యాంగులు ఫుట్ బ్రిడ్జి ఎక్కాల్సిన పరిస్థితి ఉండదు. అయితే రైల్వే అధికారులు దీని గురించే ఆలోచించడంలేదు. ఆధునికీకరణ పనులు వేగవంతంగా పూర్తికి అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. లిఫ్ట్ నిర్మాణం, రెండో ఫ్లాట్‌ఫాం పైకప్పు పనులు పూర్తయ్యే వరకు ఒకటో ఫ్లాట్‌ఫాం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



● ఎండలోనే ప్రయాణికులు



కొనసాగుతున్న లిఫ్ట్ నిర్మాణ పనులు



రైల్వే స్టేషన్‌లోకి వచ్చే దారిలో మురుగు

సమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్


ప్రజాదర్బార్‌కు బారులు తీరిన ప్రజలు

● 13వ రోజు ప్రజాదర్బార్‌కు విన్నపాల వెల్లువ

తాడేపల్లి, జూలై 8: ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం కృషి చేస్తోంది. గత ఐదేళ్ల ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందిపడ్డారు. అలాంటి వారికి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ భరోసా ఇస్తోంది. మంగళగిరితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఉండవల్లి నివాసంలో యువనేతను నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. సోమవారం పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి స్వీకరించిన యువనేత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

న్యాయం కోసం యువనేతను కలిసిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబం

రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ అయిన తన భర్తను ఆస్తికోసం వారి అన్నదమ్ములు హత్యచేశారని, తగిన న్యాయం చేయాలని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇంటి పుష్పావతి, ఆమె కుమారుడు సురేష్, మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. 2013లో ఇంటి రామలింగం హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగవిరమణ చేశారు. అప్పటి నుండి స్వగ్రామంలోనే నివసిస్తున్నారు. రామలింగానికి రెండు ఎకరాల పొలం ఉండగా గత ప్రభుత్వ అండతో ఆయన సోదరులు కబ్జా చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పథకం ప్రకారం ఆయనను హత్య చేశారు. వారి 11 ఆవులను చంపడంతోపాటు కొబ్బరిచెట్లను నరికివేసి భయభ్రాంతులకు గురిచేశారు. పోలీసులకు ఫిర్యాదుచేయగా ఆనాటి పాలకొల్లు సీఐ, ఎస్ఐ నిందితులతో కుమ్మక్కై, కేసును నీరుగార్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసును రీఓపెన్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి లోకేశ్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సొంతింటి కల నెరవేర్చాలి

గత ప్రభుత్వం తొలగించిన రేషన్‌కార్డు, దివ్యాంగ పెన్షన్ పునరుద్దరించాలని మంగళగిరి నియోజకవర్గం సీతానగరానికి చెందిన ధనుకొండ గిరిధర్ సాగర్, లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్పెంట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు సొంత ఇల్లు లేదని, ఇల్లు మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ఉద్దంటి వీరాంజనేయులు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెకు దివ్యాంగ పెన్షన్ మంజూరుచేయాలని చింతలపూడికి చెందిన తిరుమలశెట్టి శివనాగేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ చేసిన తనకు ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన చైతన్యసాయి కోరారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని వృద్ధాప్య పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన వెనిగళ్ల కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యఖర్చుల కోసం అప్పులపాలయ్యామని ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరి ఆంజనేయకాలనీకి చెందిన వీ రామలింగసాయి కోరారు. మంగళగిరి 27వ వార్డులోని చర్చి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, బండారు క్రిష్టఫర్ కోరారు. శృంగారపురం మీదుగా రేవేంద్రపాడు నుండి పెదపాలెం వరకు ఉన్న ఆర్అండ్‌బీ సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరారు. గత ప్రభుత్వం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల కోసం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష తప్పులతడకగా ఉండడంతో తీవ్రంగా నష్టపోయామని తగిన న్యాయం చేయాలని ఉపాధ్యాయులు యువనేతను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తామని లోకేశ్ అర్జీదారులకు భరోసా ఇచ్చారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుండి ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది.


దివ్యాంగుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న నారా లోకేశ్


ప్రజాదర్బార్‌కు కుటుంబసభ్యులతో వస్తున్న దివ్యాంగులు

కార్మికులకు జీవనోపాధికి భరోసా..

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్రంలోని లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధికి భరోసా ఇచ్చిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన ఇసుక విధానంతో సామాన్యులకు ఇసుక ధరాభారాన్ని ఎంతో తగ్గించిందన్నారు. నాణ్యమైన ఇసుకను పారదర్శక పంపిణీ విధానం ద్వారా ప్రజలకు అందుబాటులో వుంచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని, ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే 50 వేల కోట్లకు పైగా ఆ పార్టీ నేతలు కొల్లగొట్టారన్నారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఖర్చు అయితే అందులో ఇసుక కొనేందుకే 3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి వైసీపీ హయాంలో ఏర్పడిందన్నారు. జిల్లా స్థాయిలో ఇసుక కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టరు, జేసీ, ఆర్డీవో, మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉచిత ఇసుక పాలసీపై నిరంతర విజిలెన్స్ పర్యవేక్షణ వుంటుందని, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు ఇసుకను అందించనున్నట్లు యరపతినేని తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట


ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 8 : ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం బాట వేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగం ఊపందుకోనుందన్నారు. అలాగే సొంత ఇల్లు నిర్మించుకోవాలనుకునే సామాన్యులు, మధ్య తరగతి ప్రజల కల నెర వేరనుందని తెలిపారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే ఇచ్చిన హామీలలో ఒక్కొక్కటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తూ వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు మాఫియా ముఠాగా ఏర్పడి ఒక్క ఇసుక ద్వారానే రూ. రూ 50 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపించారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక పాలసీపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి ఇసుకను అందిస్తుందన్నారు.

ఉచిత ఇసుక పాలసీ.. పేదలకు కానుక


● పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, జూలై 8: ఉచిత ఇసుక పాలసీ.. పేదలకు ప్రజా ప్రభుత్వం ఇచ్చే కానుక అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో ఇసుక పేదలకు అందని ద్రాక్ష అని, వైసీపీ ముఠాలోని రియల్టర్లు ఇసుకను కొల్లగొట్టి అప్పటి సీఎం జగన్‌రెడ్డికి కోట్లు కూడబెట్టారన్నారు. నాణ్యమైన ఇసుకను అవసరమైన వారందరికీ, ముఖ్యంగా పేదలకు అందుబాటులో ఉంచాలన్నదే కూటమి ప్రభుత్వ విధానమన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే జీవో 43తో సీఎం చంద్రబాబు నూతన ఇసుక పాలసీని అమలు చేయటం ఎంతో గొప్పవిషయమన్నారు.

హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జూలై 8: ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబునాయుడు ఇచ్చినమాట ప్రకారం నేటి నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం తన అనుయాయులకు లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా ఇసుక విధానాన్ని జేపీ కంపెనీకి కట్టబెట్టిందని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రెవెన్యూ కూడా చెల్లించకుండా మొత్తం దోచేశారన్నారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణరంగం కుదేలై ఆ రంగాన్ని నమ్ముకున్న అనేక రకాల కార్మికులు పస్తుండే పరిస్థితి తెచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వానికి రావలసిన రెవెన్యూ కూడా వదులుకొని ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ విధానం ద్వారా నిర్మాణరంగం పరిగెత్తడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడిన అనేక రకాల కార్మికులకు జీవనోపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. గత ఐదేళ్ల కాలంలో మధ్యతరగతి వారు ఇసుక ధరలు భరించలేక కనీసం గృహనిర్మాణం కూడా చేసుకోలేకపోయారని, నేడు వారందరూ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. సీనరేజీ లేకుండా లోడింగ్, రవాణా చార్జీలతో ఇసుకను పొందే అవకాశాన్ని కుల, మత, వర్గ భేదం లేకుండా అన్నిరంగాల వారికి అవకాశాన్ని కల్పించారని అన్నారు. ఒక దార్శనికుడికి అధికారం వస్తే ఎలా ఉంటుందో మొన్న పెన్షన్ల పెంపుగాని, నేడు ఉచిత ఇసుక విధానంగాని రుజువు చేస్తుందని అన్నారు.

విద్యావ్యవస్థలోని సమస్యలను పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల


సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

శావల్యాపురం, జూలై 8: విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అన్నారు. సభ్యత్వనమోదు ప్రక్రియలో భాగంగా మండలంలోని పోట్లూరు, శావల్యాపురం జడ్పీపాఠశాలలను ఏపీటీఎఫ్ నాయకులతో కలసి సోమవారం ఆమె సందర్శించారు. ఉపాధ్యాయులను కలసి ఏపీటీఎఫ్‌లో సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరుతూ సభ్యత్వ నమోదుపత్రాలు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఏళ్ళ తరబడి పరిష్కారం కాని అనేక సమస్యలున్నాయని, ఎన్నికల హామీగా సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలకు పునర్వైభవాన్ని తేవాలని, డీఎస్సీ నిర్వహణకు సమయమున్నందున విద్యార్థులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖలో ప్రతినెలా ఉపాధ్యాయులకు ప్రమోషన్‌లు ఇవ్వవచ్చని జీవో ఉన్నప్పటికీ ఏడాదిగా ప్రమోషన్‌లు ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీపాఠశాలల్లో ప్రభుత్వం జూనియర్ కళాశాలలను ఏర్పాటుచేసిందని, కానీ ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యాబోధన కష్టతరంగా మారిందన్నారు. సీబీఎస్‌సీ బోర్డు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పాఠశాలల్లో మాత్రమే సీబీఎస్‌సీ విధానాన్ని అమలు చేస్తుందని, మిగిలిన పాఠశాలలలోని పదవ తరగతి విద్యార్థులు ఈఏడాది ఏ విధానంలో పరీక్షలు రాయాలో అర్థంకాక ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొందన్నారు. సీబీఎస్‌సీపై ప్రభుత్వం నిర్దిష్టమైన నిర్ణయాన్ని వెల్లడించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియాన్ని కూడా కొనసాగించాలని అనేక సందర్భాలలో తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళామని, తెలుగు రాష్ట్రాలలోని విద్యార్థులకు తెలుగు మీడియంలో చదువుకొనే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించాలన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల మరమ్మతుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చాలా పాఠశాలలను పడగొట్టి ఉన్నారని, విద్యార్థులు చెట్ల కింద కూర్చొని విద్యను అభ్యసిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి దానిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పల్నాడుజిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేఎస్‌కే షరీఫా, మండలాధ్యక్షులు గురుబాబు, మహమ్మద్, గోపీ, ఖాన్, సైదా, బీవీ నాగేశ్వరరావు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్ 10కి వాయిదా

గుంటూరు, జూలై 8: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ ఈనెల 10కి వాయిదా వేశారు. కాగా ఈ కేసులో ప్రభుత్వం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా హైకోర్టు న్యాయవాది అశ్వినీకుమార్‌ను నియమించింది. అయితే గురజాల కోర్టుకు జడ్జి లేకపోవడంతో ఆ కోర్టుకు గుంటూరు నాలుగవ జిల్లా సెషన్స్ జడ్జి కం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి శరత్‌కుమార్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ క్రమంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చింది. అయితే విచారణ సందర్భంగా ప్రభుత్వం నియమించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్వినీకుమార్ అందుబాటులోకి రాలేదు. ఈ కేసులో స్పెషల్ పీపీ అశ్వినీకుమార్ రెండు వాయిదాలకు గైర్హాజరవడం పట్ల జడ్జి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా సోమవారం పిన్నెల్లి బెయిల్ పిటిషన్‌పై తమ వాదనలు వినిపించేందుకు డిఫెన్స్ న్యాయవాదులు సిద్ధమయ్యారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ అందుబాటులో లేకపోవడంతో కేసును ఈ నెల 10కి వాయిదా వేశారు. అత్యంత కీలకమైన ఈ కేసులో బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరగాల్సిన సమయంలో అశ్వినీకుమార్ గైర్హాజరు కావడం న్యాయవాద వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పోలింగ్ బూత్‌లో హత్యాయత్నంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు

● 14మంది నిందితుల జాబితా ఐజీకి అందించిన సుధాకర్

గుంటూరు, జూలై 8: ఇటీవలి సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేయిచేసుకోగా తిరిగి బాధితుడు కూడా చేయిచేసుకున్న ఘటనలో ఆయనపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెనాలి ఐతానగర్‌కు చెందిన బాధితుడు గొట్టుముక్కల సుధాకర్ సోమవారం ఐజీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. పోలింగ్ రోజున క్యూలో ఉన్న ఓటర్ సుధాకర్‌పై అప్పటి ఎమ్మెల్యే శివకుమార్ చేయిచేసుకోగా సుధాకర్ కూడా తిరిగి చేయిచేసుకున్న ఘటన సంచలనం సృష్టించింది. ఈ సందర్భంగా సుధాకర్‌పై ఎమ్మెల్యే అనుచరులు, బంధువులు పెద్ద ఎత్తున విచక్షణారహితంగా దాడిచేసి కొట్టారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు తెనాలి-2 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కేసులో ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సోమవారం బాధితుడు సుధాకర్ ఐజీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తనపై హత్యాయత్నం చేశారని, ఈ సందర్భంగా నమోదైన కేసులో హత్యాయత్నం సెక్షన్ 307ను చేర్చాలని కోరారు. తాను గుర్తించిన 14మంది నిందితుల వివరాలను ఐజీకి అందించినట్లు తెలిపారు. వారితో పాటు మిగిలిన వారిని కూడా గుర్తించి వారందరిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తనపై దాడి చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆయన కుమారులు సత్యనారాయణ, అఖిల్ గణేష్, మేనల్లుడు నల్లూరి హర్షవర్దన్, అన్నాబత్తుని శ్రీధర్‌తో పాటు గుడ్డేటి సురేంద్ర, మేకల సాగర్, కొడాలి శ్రీనివాసరావు, కొమ్ము రాజేష్, వేజెండ్ల శ్రీకాంత్, అక్కిదాసు కిరణ్ కుమార్, ఖాజు, షేక్ జానీ, తెనాలి పున్నయ్య తదితరుల పేర్లను ఐజీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి ఆ కేసులో హత్యాయత్నం సెక్షన్ చేర్చడంతోపాటు తను అందించిన 14 మందితో పాటు మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని సుధాకర్ కోరారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ప్రారంభమైన టీసీఎస్ ఎన్‌క్యూటీ ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 8: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టీసీఎస్ ఎన్‌క్యూటీ (నేషనల్ క్వాలిఫైడ్ టెస్ట్) ఇంటర్వ్యూలను సోమవారం టీసీఎస్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో బీటెక్ పూర్తిచేసి ఎన్‌క్యూటీ ద్వారా ఎంపిక చేయబడిన విద్యార్థులకు విజ్ఞాన్స్ వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మెగా డ్రైవ్‌కు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, వైజాగ్ ప్రాంతాల్లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 3000మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో సత్తాచాటిన విద్యార్థులకు టీసీఎస్ నింజా రూ.3.39లక్షలు, టీసీఎస్ డిజిటల్ రూ.7లక్షలు, టీసీఎస్ ప్రైమ్ రూ.9లక్షల వార్షిక వేతనం చెల్లిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు, విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూలై 8: భాష్యం విద్యార్థులు చదువులోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సైతం తమ సత్తా చాటుతున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మెయిన్ క్యాంపస్‌లో అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భాష్యం విద్యార్థి తేజేష్ కాకర్లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎస్ఓఎఫ్ నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో భాష్యం విద్యార్థి తేజేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడని, ఇటీవల విడుదలైన ఫలితాల్లో అంతర్జాతీయ స్థాయిలో 146వ ర్యాంకును, జోనల్ లెవల్లో 2వ స్థానాన్ని పొంది వెండిపతకాన్ని, నగదు బహుమతిని గెలుచుకున్నాడని ఆయన చెప్పారు.. కార్యక్రమంలో భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీకి దాసరి వీరయ్య

మంగళగిరి, జూలై 8: దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసుకు సంబంధించి నిందితుడు దాసరి వీరయ్య తెనాలి కోర్టులో లొంగిపోయాడు. హత్య కేసు విచారణలో భాగంగా వీరయ్యను కస్టడీకి అనుమతించాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. కోర్టు అనుమతితో వీరయ్యను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముఖ్య అనుచరుడైన దాసరి వీరయ్యపై పలు ఆరోపణలు వున్నాయి. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో వీరయ్య కూడా కీలక సూత్రధారిగా వున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ముందు మంగళగిరిలో సంచలనం రేకెత్తించిన అక్రమ మద్యం నిల్వల కేసులో కూడా వీరయ్య పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


రోడ్డు ప్రమాదంలో పర్యాటక శాఖ ఉద్యోగి మృతి


రామారావు (ఫైల్)

మాచర్ల రూరల్, జూలై 8: రోడ్డు ప్రమాదంలో పర్యాటకశాఖ ఉద్యోగి మృతిచెందిన సంఘటన మండలంలోని ఏకోనాంపేట వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విజయపురి సౌత్‌కు చెందిన కొదమగుండ్ల రామారావు (45) పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతలలో కుక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎత్తిపోతలలో రాత్రి డ్యూటీ ముగించుకొని సాగర్‌లోని తన ఇంటికి బైకుపై వెళ్తుండగా మార్గ మధ్యంలోని ఏకోనాంపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం అతి వేగంతో ఢీకొట్టింది. దీంతో రామారావు తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని తెలంగాణ ప్రాంతంలోని హిల్‌కాలనీ ప్రభుత్వ వైద్యశాలకు తరలిచగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

తమ్ముడి అరాచకాలు భరించలేక

హతమార్చిన అన్న, బాబాయి


నర్రా భార్గవ్ మృతదేహం

అమరావతి, జూలై 8: వరుసకు తమ్ముడైన యువకుడు చేస్తున్న అరాచకాలు భరించలేక అన్న, బాబాయి కలసి హతమార్చిన సంఘటన మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధరణికోట గ్రామానికి చెందిన నర్రా ఉమామహేశ్వరరావు మనవడు అయిన నర్రా భార్గవ్(30) తల్లి చిన్నతనంలో చనిపోగా భార్గవ్‌ను పెద్దమ్మ వరుసైన చిట్టెమ్మ పెంచింది. భార్గవ్ చెడు అలవాట్లకు లోనై చిట్టెమ్మను బెదిరించి సంవత్సరం క్రితం అర ఎకరం భూమి తన పేర రాయించుకున్నాడు. భార్గవ్‌కు భార్య కుమారుడు ఉన్నారు. దురలవాట్లకు బానిసైన భార్గవ్ తనను పెంచిన చిట్టెమ్మను చంపుతానని బెదిరించడం, కొట్టడం చేస్తున్నాడు. అది గమనించిన చిట్టెమ్మ కుమారుడు నూతలపాటి శ్రీనివాసరావు, భార్గవ్‌ను మందలించగా అతనిని కూడా చంపుతానని బెదిరించాడు. దీంతో శ్రీనివాసరావు వరుసకు బాబాయి అయిన నంబూరు శ్రీనివాసరావు సహకారంతో ఇద్దరు కలసి భార్గవ్‌ను అమరావతిలోని బాపూజీ కాలనీలో ఉన్న ఇంటికి తీసుకెళ్లి హతమార్చారు. తరువాత భార్గవ్ మృతదేహాన్ని ఆరుడొంకల బావి సమీపంలోని బైపాస్ రోడ్ సమీపంలో పడవేసి మరలా అక్కడనుండి ధరణికోటలోని భార్గవ్ ఇంటికి తీసుకెళ్లి తాత ఉమామహేశ్వరరావుకు అప్పగించారు. యాక్సిడెంట్‌లో భార్గవ్ గాయపడ్డాడని తెలుసుకుని అక్కడ నుండి ఇంటికి తీసుకు వచ్చామని చెప్పారు. ఉమామహేశ్వరరావు భార్గవ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఉమామహేశ్వరరావు తన మనవడిని ఇద్దరు ఇంటి వద్ద నుండి తీసుకెళ్లి హతమార్చారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌హెచ్ఓ ఏవీ బ్రహ్మం ఉమామహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు పరారీలో ఉన్నారు.

ఏపీ పీసెట్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 8: ఆంధ్రప్రదేశ్‌లో వ్యాయామ విద్య కోర్సులైన బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 ఫలితాలను సోమవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. జాన్సన్ మాట్లాడుతూ జూన్ 24నుంచి 27వరకు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహించిన పీసెట్ పరీక్షల ఫలితాలు విడుదల చేశామని పేర్కొన్నారు. ఈ పరీక్షకు 1641మంది దరఖాస్తు చేసుకోగా, 1124మంది హాజరయ్యారని, వారిలో 784మంది పురుషులు, 340 మంది మహిళా అభ్యర్థులు పరీక్షలకు వచ్చినట్లు పేర్కొన్నారు. వారిలో 1064 మంది 95.11% అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఏపీ పీసెట్ వెబ్సైట్ నుంచి ర్యాంక్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఉన్నత విద్యామండలి ఆదేశానుసారం త్వరలో ప్రవేశాల వివరాలు వెల్లడిస్తామని ప్రొఫెసర్ జాన్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ పీసెట్ కన్వీనర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, వ్యాయామ విద్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

20న రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 8: స్థానిక గోరంట్ల, అమరావతి రోడ్డు, నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలు క్రీడా మైదానంలో ఈనెల 20న జిల్లా రోప్ స్కిప్పింగ్ ఉమ్మడి జిల్లా జట్ల కొరకు ఎంపికలు నిర్వహిస్తునట్టు రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి తిరుపతి రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 8, 10, 12, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తునట్టు పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 63048 81562, 82475 65411 నెంబర్లును సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

26,159 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 29,187 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 26,159 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 14,317 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	16500
నెంబరు.5	11000	14200
273	11000	12000
341	9000	16500
4884	12000	12000
సూపర్ 10	13500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	19000
బ్యాడిగి	9000	18000
దేవనూరుడీలక్స్	10000	13500
తెల్లకాయలు	5000	13000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	13500
నెంబరు. 5	9000	10000
273	13000	13000
341	8500	16500
4884	13500	16000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	18000
బ్యాడిగి	9000	13000
దేవనూరుడీలక్స్	12000	12000
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


తిరుమలలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబసభ్యులు


శ్రీవారిని దర్శించుకున్న యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 8: తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి వారిని సోమవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. పల్నాటి ప్రజలు పాడిపంటలు, సుఖశాంతులతో ఆరోగ్యంగా జీవించడంతో పాటు నియోజకవర్గంలోని ప్రతిఒక్కరు ఐక్యతతో గ్రామాలను అభివృద్ధి చేసుకునే దిశగా వుండాలని స్వామివారిని కోరుకున్నట్లు యరపతినేని తెలిపారు. యరపతినేని శ్రీనివాసరావుతో పాటు కుమారులు మహేష్, నిఖిల్, కంచేటి శివలు స్వామివారిని దర్శించుకున్నారు.

హెల్మెట్ ధరించక పోవడం నేరం

● సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

గురజాలటౌన్, జూలై 8: 'ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించక పోవడం ప్రమాదకరమే కాదు.. నేరంకూడా' అని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, సిబ్బందికి హెల్మెట్ ధరించకపోవడం వలన కలిగే అనార్థాలపై సోమ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోటారు వాహనాలను నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు, సీనియర్ న్యాయవాదులు ఎస్‌కే జానీబాషా, చలమరాజు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం జగన్ ఫోటోతో ఇచ్చిన ధ్రువీకరణ పత్రం

ధ్రువీకరణ పత్రాలపై జగన్ లోగో

● ప్రభుత్వం మారినా తొలగించని ఫోటోలు

గురజాలటౌన్, జూలై 8: సచివాలయ, మీ సేవా కేంద్రాల్లో ఇచ్చే ధ్రువీకరణ పత్రాలపై ఇంకా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోతో లోగో కనిపించడంతో టీడీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారి నెల రోజులయినా ధ్రువీకరణ పత్రాలపై జగన్ లోగో కనిపించడంతో వారు మండిపడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు ఇంకా చర్యలు తీసుకోకపోవడంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఒక దరఖాస్తు దారుడు ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకోగా, దానిపై జగన్‌మోహన్‌రెడ్డి లోగో కనిపించడంతో అవాక్కయ్యాడు. అతను తీసుకున్న ధ్రువీకరణ పత్రం సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో కూటమి నేతలు, ప్రజలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్త చేస్తున్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి జగన్ ఫోటో తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీర్లచావిడిలో కర్ర పీర్లు

దాచేపల్లి, జూలై 8: కులమతాలకు అతీతంగా దాచేపల్లిలో జరిగే మొహర్రం (సంతాపదినాలు)కు ఓ ప్రత్యేకతవుంది. ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా దాచేపల్లిలో జరిగే మొహర్రంలో భాగంగా చావిడిలో కర్రపీర్లు, గంథం పీర్లను వుంచుతారు. మూడు, ఐదు, ఏడు షరగత్‌లను నిర్వహిస్తారు. అదేవిధంగా తంగెడ గ్రామంలో జరిగే ఏడవ షరగత్ రోజు కర్రపీర్లు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారు. ఈ వేడుకలను చూసేందుకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. 10వ షరగత్‌న దాచేపల్లిలో కర్ర పీర్లు, గంధం పీర్లు ప్రధాన వీధులలో ఊరేగింపుగా రావడంతో వాటిని చూసేందుకు మండల ప్రజలంతా దాచేపల్లికి చేరుకుంటారు. ఓలిరునాళ్ల వాతావరణాన్ని కలిగిస్తుంది.

ప్రజా వేదికకు వెల్లువెత్తిన ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, జూలై 8: నిమ్మతోటకు చెందిన ఓ ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకుడు తనకు 2019లో ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఇప్పిస్తానని చెప్పి ఫైలును తీసుకున్నాడని, ఇంతవరకు సదరు ఫండ్‌ను ఇప్పించ లేదని మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కాట్ల శిరీష ఎస్పీకి ఫిర్యాదు చేసింది. పట్టణంలోని బరంపేటకు చెందిన ఐ శ్రీనివాసరెడ్డి తనకు సంబంధించిన ఇంటిని అద్దెకు తీసుకున్న వారు అద్దె ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పెదచెరువుకు చెందిన లక్ష్మీ కోటమ్మ పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టు ఆమె సహచర ఉద్యోగి స్వప్న ప్రియకు రూ.20 లక్షలు అప్పు ఇవ్వగా, అనంతరం సదరు డబ్బును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేసింది. అచ్చంపేట మండలం పెద పాలెం గ్రామానికి చెందిన అంబటి నరసింహారావు అనే రైతు రైతుల వద్ద నుంచి రూ 1.42 కోట్ల మిర్చిని కొనుగోలు చేసి సదరు మిర్చిని గుంటూరుకు చెందిన లక్ష్మీశెట్టి రవికుమార్‌కు అమ్మాడని, రూ 90 లక్షలు నగదు ఇచ్చి మిగిలిన డబ్బును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. కాగా 2022 డిసెంబరు 20న తన తండ్రి షేక్ ఇబ్రహీంను మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు సుభానీ, ఖాజావలి, పెద బుజ్జీలు హత్య చేశారని ప్రత్యేక సాక్షులు తెలిపినా వారిపై చర్యలు తీసుకోలేదని, తగు చర్యలు తీసుకోవాలని షేక్ బాజీ, బషీరున్‌లు ఫిర్యాదు చేశారు. కాగా పట్టణానికి చెందిన ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కాకుమాను సదాశివారెడ్డిపై బ్యాంక్ ఉద్యోగి వడ్లమూడి నరసింహారావు ఫిర్యాదు చేశారు. సదాశివరెడ్డి తన వద్ద కారు కొనుగోలు చేశాడని, దానికి సంబంధించి రూ.7లక్షలు చెల్లించకుండా మోసగించాడని ఎస్పీని ఆశ్రయించాడు.

యువకుడిపై హత్యాయత్నం

నరసరావుపేట లీగల్, జూలై 8: పట్టణంలోని పాతూరుకు చెందిన జమ్ముల శ్రీనివాసరావుపై అదే ప్రాంతానికి చెందిన శీలం సుధీర్, జగదీష్, మరికొందరు హత్యాయత్నానికి వడిగట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 15న స్వల్ప వివాదం నేపథ్యంలో పాతూరులో ఇద్దరు నిందితులు మరికొందరితో కలసి తనను కత్తితో పొడిచి హత్యాయత్నానికి వడిగట్టినట్టు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులు

● వివిధ ప్రాంతాల్లో 75వ జయంతి కార్యక్రమాలు

పిడుగురాళ్ల, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని సోమవారం కొండమోడు జంక్షన్‌లోని కాసు వెంగళరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం, అంజిరెడ్డి హస్పటల్ వద్దవున్న రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో, తాలూకా సెంటర్‌లో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పలువురు వైసీపీ నాయకులు, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిడుగురాళ్లలో విజృంభిస్తున్న డయేరియా

● పట్టణ పరిధిలో సోమవారం మరో ఐదు కేసులు
● ఇంటింటికి మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది


లెనిన్‌నగర్‌లో పర్యటిస్తున్న వైద్యాధికారి బీ.గీతాంజలి తదితరులు

పిడుగురాళ్ల, జూలై 8: గత ఐదు రోజులుగా పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాలలో డయేరియా వ్యాధి వ్యాప్తి విజృంభిస్తోంది. సోమవారం ఐదు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి బీ.గీతాంజలి బాధితుల ఇంటింటికి వెళ్లి వైద్యసేవలు అందుతున్న వైనాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇంటో ఉండే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి కలుషితం ఏర్పడి వ్యాధులు ప్రబలే అవకాశం వుందని, కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఎవరైనా డయేరియా లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే స్థానిక ఆస్పత్రిలోని వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రవితేజ, నస్రీన్, బాలాజీ, అమరేశ్వరరెడ్డి, అనిల్, పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోకి మురుగునీరు

● దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవస్థలు
● పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

దాచేపల్లి, జూలై 8: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రతకు నిలయంగా మారింది. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థులు ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. వీరిలో ఎస్సీ ఎస్టీ బీసీలకు చెందిన విద్యార్థులే అధికంగా వున్నారు. గ్రామంలోని నివాస గృహాలలోని మురుగునీరు అంతా కాల్వల ద్వారా ప్రవహించి ఊరికి చివరగావున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి చేరుతుంది. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థులు వారు తిన్న ప్లేట్లు కడుక్కున్న నీరు కూడా అదే మురుగులోకి చేరుతుంది. దీంతో పాఠశాల ఆవరణలోని ఆ ప్రాంతం ఓ మురికి గుంటలా తయారైంది. పాఠశాల మూసిన తర్వాత పందులు, కుక్కలు ఆ మురుగులో దొర్లుతున్నాయి. దీంతో పాఠశాలలో దుర్వాసన వెదజల్లుతుంది. చిన్నారులంతా దుర్వాసన భరాయిస్తూ విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో పనిచేసే


పాఠశాల ఆవరణలోకి మురుగునీరు వచ్చి చేరుతున్న దృశ్యం

ఉపాధ్యాయులంతా బయటి వ్యక్తులే కావడంతో ఎవరికి చెబితే ఏమి కోపాలు వస్తాయోనని తమ విధులు తాము నిర్వహించుకుంటూ గమ్మున వుండిపోతున్నారు. ఫలితంగా పాఠశాల ఆవరణం కాస్త మురికి కూపంగా మారుతుంది. దీనికి తోడు పాఠశాల చుట్టుపక్కల పరిసరాల మొత్తం పిచ్చికంప నిండి వుండటంతో చెత్త చెదారం చేరి చిన్నపాటి అడవిని తలపింపజేస్తుంది. విషసర్పాలు, తేళ్లు నిత్యం పాఠశాలలోకి వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పాఠశాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, డ్రయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి పాఠశాలను పరిశుభ్రతకు చిహ్నంగా మార్చాలని కోరుతున్నారు.


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఉచిత ఇసుక పంపిణీపై హర్షం

● సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

మాచర్లటౌన్, జూలై 8: కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక పంపిణీ చేయడంపై భవననిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సోమవారం పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చితపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, ఎస్‌డీ బాషా మేస్త్రి, బత్తిన శ్రీనివాసరావు, మంచికల్లు శ్రీనివాసరావు, దాసి శ్రీనివాసరావు, విష్ణు, మొలకల అప్పారావు, భరస వెంకన్నబాబు, చిన జక్రయ్య, చిన శేషు, ఆంజనేయులు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

● ఎంపీపీ సునీత సాయిశంకర్

దుర్గి, జూలై8: రైతులకు పండ్ల తోటలు, కాయగూరల పెంపకంపై అవగాహన కల్పించాలని ఎంపీపీ సునీత సాయిశంకర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి, పత్తి, కంది సాగులో రైతులకు అధికంగా నష్టాలు వస్తున్నాయన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా పంట మార్పిడి సాగులో భాగంగా బత్తాయి, బొప్పాయి, మునగ, డ్రాగెన్ ఫ్రూట్స్, కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి సాగులోకి వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుప్త, హెచ్‌వో సురేష్, ఏవో అమీర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సత్తెనపల్లి, జూలై 8 : పట్టణంలోని తారక రామ వాకింగ్ ట్రాక్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని, పెరిగిన గడ్డిని తొలగించాలని కోరుతూ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం మునిసిపల్ కమిషనర్ షమ్మిని కలసి వినతి పత్రం అందజేవారు. మదరుగుదొడ్లు టాయిలెట్స్ లేక పోవటంతో వాకింగ్‌కు వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ గడ్డి ఎక్కువగా పెరగటంతో పాములు సంచరిస్తున్నాయన్నారు. వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వారు కమిషనర్‌ను కోరారు. హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

మాచర్ల రూరల్, జూలై 8: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బిగ్ హెల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను ఎంఈవో అల్లి సురేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్ట్ చైర్మన్ చాంద్ బాషా బాలికలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షకీనా, రామారావు, తాటి భాస్కరబాబు, జూపల్లి గంగాధర్, పఠాన్ నాగూర్‌వలి, బాలనాగమ్మ బాయి, నాగరాజు, గాలీబు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

12న బల్ల కట్టు వేలం

మాచవరం, జూలై 8: గోవిందాపురం కృష్ణానదిపై నిర్వహిస్తున్న బల్లకట్టుకు ఈనెల 12న గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా దారావత్తు చెల్లించాల్సి వుంటుందని, పూర్తి వివరాలకు జిల్లాపరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీవో సూచించారు.

దుర్గి ఎస్‌ఐ కోటయ్యపై వేటు ?

దుర్గి, జూలై 8: మండల కేంద్రమైన దుర్గి పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కోటయ్యపై వేటు పడినట్లు సమాచారం. ఆదివారం మండలంలోని జంగమహేశ్వరపాడులో నాటుబాంబు పేలిన విష యం తెలిసిందే. అయితే గ్రామంలో నాటు బాంబులు ఉండటం, పేలుడు జరగటం వంటి ఘటనలు విధి నిర్వహణలో ఎస్‌ఐ బాధ్యతా రాహిత్యంగా కారణగానే జరిగాయాని ఎస్పీ మలికాగార్గ్ భావించి ఎస్‌ఐ కోటయ్యను వీఆర్‌కు పంపిస్తూ ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం.

ఉచిత ఇసుకతో కార్మికులకు జీవనోపాధి

బెల్లంకొండ, జూలై 8 : భవన నిర్మాణం కష్టపడే ప్రతి కార్మికులకు ఇసుక వల్ల జీవనోపాధి కలిగినట్లేనని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. సోమవారం మండల కేంద్ర మైన బెల్లంకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీతో కార్మికులకు చేతినిండా పని ఉన్నట్లేనన్నారు. ఈ విధానంతో భవన నిర్మాణ అనుబంధ వృత్తుల్లోని ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం ఎంతో మేలు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలుగా ఆర్థికంగా చితికిపోయిన పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉచిత ఇసుక విధానంపై నేడు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన నెల వ్యవధిలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నాయకత్వంలో మండలంలో అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతి సముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, వైస్ సర్పంచ్ సుభానీ వెన్నా సీతా రామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గన్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు


● స్టాక్ రిజిస్టర్ల పరిశీలన
● అనధికార అమ్మకాలు నిలుపుదలకు ఆదేశాలు

సత్తెనపల్లి, జూలై 8 : పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను సోమవారం ఇన్‌చార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. పట్టణంలోని శివ శంకర ఎరువులు, పురుగు మందుల షాపులో ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేకుండా విక్రయిస్తున్న 30.5 లీటర్ల పురుగు మందులు, ఫారం-ఓ లేని 78.06 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు. వీటి విలువ రూ 13.50 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అనధికార డీలర్ల వద్ద నుంచి స్టాక్ తీసుకొని విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు.

దుర్గి: ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు, నాసిరకం పురుగు మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ డీడీఏ సీహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం దుర్గిలో ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీచేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీడీఏ మాట్లాడుతూ వ్యాపారులెవరైనా ఇబ్బందికరంగా నడుచుకుంటే రైతులు తమ దృష్టికి తీసువస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ రామచంద్రయ్య, ఏవోలు వరలక్ష్మి, అమీర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలు, పార్శిల్ కార్యాలయాల్లో సోమవారం విజిలెన్స్, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. స్టోర్స్ సర్టిఫికెట్ లేని విత్తనాలకు అధికారులు అమ్మకాలను నిలిపివేశారు. రూ.6,58740 విలువగల స్టాక్‌ను అధికారులు గుర్తించారు. అలాగే అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను విక్రయిస్తే విత్తనచట్టం ప్రకారం తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏలు శ్రీకృష్ణదేవరాయలు, వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్, ఏఓలు శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్, వ్యవసాయ అధికారులు


సత్తెనపల్లిలో తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

బెల్లంకొండ: మండలకేంద్రమైన బెల్లంకొండలో ఎరువులు, పురుగు మందుల విత్తనాల దుకాణాల్లో విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమిషనర్ ఆదేశాల ప్రకారం తనిఖీలు నిర్వహించినట్టు విజిలెన్స్ ఏడీఏ వెంకటేశ్వరరావు తెలిపారు. సాయిచరణ్ ఫెర్టిలైజర్ షాపులో ఎరువుల లైసెన్స్ ఫారం పొందుపరచని కారణంగా 20-20-0-13ఫ్యాక్ట్ 50కేజీల బస్తాలు సుమారుగా రూ.44 వేలు ఖరీదు చేసే అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 60 లీటర్ల విలువ చేసే రూ 11,398 నిల్వల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని వ్యాపారుకుట సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రవి కుమార్, బెల్లంకొండ ఏవో కృష్ణయ్య, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


లోడింగ్‌కు సిద్ధంగా ఉంచిన ఇసుక నిల్వ

వైకుంఠపురంలో ప్రారంభమైన ఇసుక లోడింగ్

అమరావతి, జులై 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఉచిత ఇసుక విధానం తొలిరోజు సోమవారం మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుక రీచ్‌లోని స్టాక్‌యార్డులో ప్రారంభించారు. ఈ స్టాక్ పాయింట్‌లో 64,467 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండగా సోమవారం మూడు వాహనాలకు 24 టన్నులు లోడింగ్ చేయడం జరిగింది. టన్ను రూ132రూపాయల చొప్పున ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసుకున్న వారికి ఇసుక లోడింగ్ చేయడం జరుగుతుంది. సోమవారం సాయంత్రం ఇసుకను వాహనాలకు లోడింగ్ చేశారు. మైనింగ్ అధికారులు అనంద్, రాజేష్, వీఆర్వో వెంకటకృష్ణ సమక్షంలో ఇసుక లోడింగ్ ప్రారంభించారు.

అచ్చంపేటలో ప్రారంభం కాని రీచ్‌లు

అచ్చంపేట: అచ్చంపేట మండలంలోని కోనూరు, కొత్తపల్లి, మాదిపాడు గ్రామాల్లో 1,49,442 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిద్ధంగా ఉంది. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఇసుకను తీసుకువెళ్ళేందుకు కోనూరులో వందలాది లారీలు బారులు తీరాయి. కోనూరు స్టాక్ పాయింట్‌లో 49,171 మెట్రిక్ టన్నులు, కొత్తపల్లిలో 24,393 మెట్రిక్ టన్నులు, మాదిపాడులో 75,878 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితంగా ఇచ్చేందుకు సిద్ధంగా నిల్వలు ఉన్నాయి. సోమవారం నుంచి ఉచితంగా ఇచ్చే ఇసుక ప్రారంభం కాలేదు. ఆయా స్టాక్ పాయింట్ల వద్ద ఒక వీఆర్‌వోతో పాటు వీఆర్‌ఏలు కాపలాలు ఉన్నారు. అనుమతి రాని కారణంగా సాయంత్రం వరకు రీచ్‌లు ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు.

వ్యవసాయ శాఖాధికారుల తనిఖీలు

మాచర్ల రూరల్, జూలై 8: మాచర్ల పట్టణంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపులను సోమవారం వ్యవసాయ శాఖాధికారులు తనిఖీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్ సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించాలన్నారు. రైతులు విక్రయాలకు సంబంధించిన బిల్లులను దగ్గర ఉంచుకోవాలని, సమస్యలు ఉత్పన్నమైనప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్‌ఐ రామచంద్రారెడ్డి, ఏవోలు వరలక్ష్మి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, డయేరియా వ్యాధులతో అప్రమత్తం

క్రోసూరు, జూలై 8 : క్రోసూరు పీహెచ్‌సీ పరిధిలో డెంగీ, డయేరియా వ్యాధి వ్యాప్తితో వైద్య సిబ్బందితో పాటు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు హెచ్చరించారు. మండలంలోని క్రోసూరు, 88 తాళ్ళూరు గ్రామాల్లో నిర్వహించిన డయేరియా, డెంగీ వ్యాధి నిర్మూలన మాసోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. క్రోసూరులోని పాఠశాలలను సందర్శించి పరీక్షల నిమిత్తం విద్యార్థుల రక్తనమూనాలను స్వీకరించారు. డయేరియా నిర్మూలన కోసం చేపట్టాల్సిన చర్యలను సూచించారు. డయేరియా లక్షణాలు కన్పించగానే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవటంతో పాటు, దోమల వ్యాప్తి నిరోధక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

సత్తెనపల్లి, జూలై 8 : సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో సోమవారం హైదరాబాద్ రీజనల్ లెవల్ అండర్-14, అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్ - 14 విభాగంలో ఎనిమిది టీమ్‌లు, అండర్ - 17 విభాగంలో 8 టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీలను ప్రారంభించిన కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ జగదీష్‌గుప్తా మాట్లాడుతూ పోటీలు విద్యార్థుల్లో స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని, క్రీడా స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. లీగ్ పోటీలు జరిగాయని, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి బీ కిరణ్‌రెడ్డి తెలిపారు.

రహదారిపై భారీ గుంత

● పట్టించుకోని అధికారులు..
● ఆందోళనలో ప్రయాణికులు, గ్రామస్థులు


బుచ్చయ్యపాలెం వెళ్ళే రోడ్డులో ఏర్పడిన భారీ గుంతను చూపుతున్న మాజీ సర్పంచ్ పూర్ణ చంద్రరరావు

పెదకూరపాడు, జూలై 8 : మండలంలోని బుచ్చయ్యపాలెం వెళ్ళే ఆర్‌అండ్‌బీరోడ్డు మధ్య గుంత ఏర్పడి ప్రమాద భరితంగా ఉన్నప్పటికీ పట్టించుకొనే అధికారులు కరువయ్యారు. ఈ రోడ్డులో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణీకులు వాహనాలపై ప్రయాణిస్తుంటారు. గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా గ్రామస్తులు గుంట మధ్యలో తాటి బొత్తలు పెట్టి న కొన్ని సమయాల్లో వాహన దారులు తెలియ కుండా గుంట వైపుకువెళ్ళి ప్రమాదంభారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబందితశాఖ అధికారులు ప్రమాద భరితంగా ఉన్న ఈ రోడ్డు పై దృష్టి సారించి గుంతను పూడ్చివేసి ఆయా గ్రామాల ప్రజలకు, ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరరావు కోరారు.

రెడ్డిగూడెంలో పారిశుధ్యం అధ్వానం

● చర్యలు చేపట్టాలని అధికారులకు గ్రామస్థుల వినతి

రాజుపాలెం, జూలై8 : మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో సైడు కాలవలలో పూడికతీసి, మురుగు పారుదల సౌకర్యాన్ని మెరుగుపర్చి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఆ గ్రామస్థులు అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో తహశీల్దార్ నరసింహం, ఎంపీడీవో రామకృష్ణలకు వినతిపత్రం అందజేశారు. అలాగే మసీదు సెంటర్లో మురుగు నీరు పెరుకు పోయి దుర్వాసన వేదజల్లుతుందని, దీంతో చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పదించి గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని వారు విన్నవించారు.

నిరు పేద వృద్ధురాలికి సాయం

క్రోసూరు, జూలై 8 : మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన నిరు పేద వృద్ధురాలు షేక్ చాంద్‌బీకి ఎస్‌ఆర్‌ఐ కిలారి నరేంద్ర సోమవారం బియ్యం, నిత్యవసర వస్తువులను అందచేశారు. స్నేహితుల ద్వారా ఆమె ఇబ్బందులను తెలుసుకున్న ఆయన కొన్ని నెలలకు సరిపడ సరుకులను, ఇతర సామగ్రిని తన స్నేహితుల ద్వారా పంపించినట్టు తెలియజేశారు. గ్రామాల్లోని నిరుపేద వృద్ధులకు, మహిళలకు సాయం అందించేందుకు తాము సిద్ధం గా ఉన్నట్లు తెలిపారు. స్థానికుల సహకారంతో త్వరలో క్రోసూరు మండల గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదు

క్రోసూరు, జూలై 8 : గత ప్రభుత్వంలో చేసినట్లు ఇప్పుడు నకిలీ విత్తనాలను విక్రయించటం, రైతులను మోసం చేయటం లాంటివి చేస్తే సహించేది లేదని, కేసులు పెట్టి జైలుకి పంపుతామని నియోజక వర్గ తెలుగురైతు అధ్యక్షులు తోక వెంకటరావు విత్తన డీలర్లను, వ్యాపారులను హెచ్చరించారు. సోమవారం క్రోసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో నియోజక వర్గంలోని పలు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని, ఇప్పుడు మళ్లీ అలా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సంవత్సరం ఇప్పటికే రైతులందరూ పొలాలు దున్నుకొని పత్తి విత్తనాలను వేసే పనిలో నిమగ్నమయ్యారని, విత్తనాల డీలర్లు సక్రమమైన రైతులు అడిగిన విత్తనాలు ఇవ్వాలని ఆయన సూచించారు.



కలెక్టర్ అరుణబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట టౌన్, జూలై 8: కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన అరుణ్ కుమార్‌ను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈసందర్భంగా నియోజవర్గంలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తులు దోచుకోవడం తప్ప అభివృద్ధి గురించి ఆలోచించడం మానేశారన్నారు. మన పాలనలో అభివృద్ధికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. అందుకు జిల్లా కలెక్టర్ తోడుగా నిలవాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీదారులకు అన్నదానం

నరసరావుపేట టౌన్, జూలై 8: పేదలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకోవడమే తన ముందున్న తక్షణ కర్తవ్యం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులకు అన్నదాన కార్యక్రమాన్ని పట్టణ ఆర్యవైశ్య నాయకులు, పట్టణ మాజీ కౌన్సిలర్ గట్టుపల్లి సత్యనారాయణ, కలిసి ప్రారంభించారు. అనంతరం అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారికి ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో కొత్తూరి హనుమంతురావు, వేల్పుల సింహాద్రియాదవ్, చిన్నపరెడ్డి, ఇమ్మడిశెట్టి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో మురుగు కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

క్లీన్ నరసరావుపేటే లక్ష్యం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 8: క్లీన్ నరసరావుపేట సాకారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డులలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున వార్డులో శానిటేషన్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిషనర్‌కు సూచించారు. గత పాలకులు పారిశుధ్య పనులలో కూడా నిర్లక్ష్యం చూపి పేదల ప్రాణాలు తీశారన్నారు. ఇకపై అలాంటి ఘటనలకు తావు ఇవ్వకూడదని అధికారులను ఆదేశించారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలకు విముక్తి కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లతో కలిసి క్రిష్టియన్ పాలెం, ఇస్లాంపేటలో కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తులు ఎవరి ఆక్రమణలో ఉన్నా ఉపేక్షించబోమని అన్నారు. నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనంలోకి తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ రెడ్డి నియామకం



రోటరీ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జూలై 8: వినుకొండ నియోజక వర్గం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం మహోత్సం పట్టణంలోని కారంపూడి రోడ్డు లోని బృందావనం గార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శిగా వైవీ నారాయణ, ట్రెజరర్‌గా ఎస్‌కే మస్తాన్‌వలిని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కె. శరత్ చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రోటరీ క్లబ్‌లో సభ్యుడిగా చేరినందుకు చాలా సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో రోటరీ క్లబ్‌కు సహాయ, సహకారాలు అందచేస్తానని తెలిపారు. ఆదేవిధంగా ఎక్కువమంది సభ్యులను రోటరీ క్లబ్‌లో భాగస్వాలు చేసేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఆఫీస్ బేరర్, సభ్యులు కష్టపడి నిరుపేదలకు సేవలు అందించాలని కోరారు. అనంతరం నూతనంగా ప్రమాణ స్వీకారంచేసిన అధ్యక్ష, కార్యదర్శి ట్రెజరర్‌లను ప్రత్యేకంగా దుశ్శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, గుత్తా గుర్నాధం, సినీ యాక్టర్ బొరిగొర్ల కోటియాదవ్, బత్తుల శ్రీనివాసరావు, ముత్తినేని గిరిబాబు, కూచి రామాంజినేయులు, మేడికొండ. శ్రీనివాసరావు, ఎం. అంకారావు, ఎస్‌కే కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవాసంస్థల సహకారం అభినందనీయం

బొందిలిపాలెం (శ్యావల్యాపురం), జూలై 8: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పేద విద్యార్థులకు సేవాసంస్థల ద్వారా పూర్వవిద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం నూకల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామానికి చెందిన శ్రీఅడవి పేరంటాలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలోని మెయిన్, బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలలోని 40మంది విద్యార్థులకు సంవత్సరానికి సరిపడా నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీలు, పలకలు, ప్యాడ్లు తదితర విద్యాసామగ్రిని సేవాసమితి సభ్యులు సోమవారం విద్యార్థులకు అందజేశారు. పాఠశాల పీఎంసీ ఛైర్మన్, సేవాసమితి సభ్యుడు బోడాల వీరయ్య మాట్లాడుతూ పేదవిద్యార్థులను ప్రోత్సహించేందుకు సేవాసమితి ద్వారా 2013 నుంచి ప్రతిఏటా విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. సేవాసమితి ద్వారా వాటర్ ప్లాంట్‌ను స్థాపించి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. హెచ్ఎం రబియా, ఉపాధ్యాయని ఫాతిమా మేరీ, సీఆర్పీ, సేవాసమితి సభ్యుడు ఎలికా శ్రీనివాసరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలి

● సీపీఎం మండల కార్యదర్శి మోహన్‌చంద్

శావల్యాపురం, జూలై 8: రాష్ట్రంలో సోమవారం నుంచి అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కూటమి ప్రభుత్వం ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుక ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతిన్నదని, భవన నిర్మాణ కార్మికులకు జీవనోపాధి కరువై వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ రంగానికి పునర్ వైభవం రానుందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని, ఎన్నోఏళ్ళుగా ఎదురుచూస్తున్న పేదలకు సొంతింటి కల సాకారం కానుందన్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని సమర్థవంతంగా అమలుచేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముగిసిన పూజలు

నరసరావుపేట అర్బన్, జూలై 8: నరసరావుపేట మునిసిపల్ ప్రాంగణంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి విశేష పూజలు జరుగుతున్నాయి. లోక కల్యాణార్థం వారాహి అమ్మవారి నవరాత్రులు సందర్భంగా త్రయాహ్నిక దీక్ష, రాజశ్యామల యాగం నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో చండీ యాగం నిర్వహించారు. పూజలను వావిలాల ప్రశాంత్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ నిర్వహించారు. పూజల్లో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి బొమ్మను ఆలయ ఆవరణలో పొందుపరిచారు. వారాహి అమ్మవారిని, కల్యాణ వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజలు జరిగాయి.

ప్రభుత్వ ఇసుక పాలసీపై కార్మిక సంఘాల హర్షం



మార్కాపురం రోడ్డులోని స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వ

వినుకొండ, జూలై 8: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కార్మికులకు ఇచ్చిన హామీమేరకు నేడు ఉచిత ఇసుకను ప్రవేశ పెట్టడంపై కార్మికవర్గాలు సోమవారం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రవాణా ఖర్చులతో ఇసుక సరఫరా చేయనున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఉండాల్సిన స్టాక్ పాయింట్‌ను కాంట్రాక్టర్లు వ్యక్తిగత ప్రయోజనాల మేరకు మార్కాపురం రోడ్డులోని భ్రమరా టౌన్‌షిప్ వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటుచేశారు. 2వేలు మెట్రిక్ టన్నుల ఇసుకను ఇప్పటికే రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో వినుకొండ ఏనుగుపాలెం రోడ్డులోని మార్కెట్ యార్డులో ఇసుక స్టాక్ పాయింట్ నుంచి బ్లాక్ మార్కెట్ తరలించి, కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు దోచుకున్నారు. గతంలో వరదల కారణంగా ఇసుక పంపిణీ నిపివేశారు. ఇదే అదనుగా వైసీపీ నాయకులు యార్డులోని ఇసుకను అక్రమంగా రాత్రి వేళల్లో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడంపై కాంట్రాక్టర్లు ఇసుక దొంగలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం స్టాక్ పాయింట్‌ను మార్కాపురం రోడ్డుకు ఇసుకను తరలించి కాంట్రాక్టరు జేబులు నిపుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చి తర్వాత వేల టన్నుల ఇసుకను బ్లాక్ మార్కెట్ తరలించినట్లు చెబుతున్నారు.

జీవీకి అభినందనలు

వినుకొండ టౌన్, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీపై కార్మిక సంఘాలు నాయకులు సోమవారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు, మాజీ సర్పంచి చంద్రపాటి సైదా మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు కార్మిక సంఘాలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచ్చిత ఇసుక పాలసీతెచ్చి కార్మికులకు పూర్వవైభవం తెచ్చారని, నిర్మాణ రంగంలో ప్రధానంగా ఇసుక ఉచ్చితంగా ఇవ్వడం వలన కూలీల రేట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్మిక రంగాన్ని పూర్తిగా సంక్షోభంలో నెట్టారని, కార్మిక సంక్షేమ బోర్డు నిధులు పక్కదారి పట్టించి తీరని అన్యాయం చేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్క కార్మికుడికి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఇసుకాసురులకు అంతం పలికిన శుభదినంగా జూలై-8 అని. ఉచిత ఇసుక విధానం పునరుద్ధరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగన్ రెడ్డి ఇసుక పాలసీ పేరుతో వేల కోట్లు దోచుకున్నారని ఇసుకలో జగన్ ముఠా దోచుకున్న ప్రతి పైసా కక్కడమే తదుపరి లక్ష్యమన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు రావలసిన అన్ని ఎన్డీఏ ప్రభుత్వంలో అందుతాయని, ప్రతి కార్మికుడికి ఇంటి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని కార్మిక నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు, బొట్టు శ్రీను, మోతాదు మస్తాన్, మీరావలి, గుర్రం యలమందతో పాటు, కార్మికులు పాల్గొన్నారు.



ఉచిత ఇసుక పాలసీపై ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి అభినందనలు తెలియచేస్తున్న కార్మిక సంఘం నాయకులు

ఘనంగా వైఎస్సార్ జయంతి



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్సీ రాజశేఖర్ తదితరులు

చిలకలూరిపేట, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ భాస్కర్ థియేటర్ వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్, సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన స్వర్ణయుగ పాలన అన్నారు. ఆయన సేవలను ప్రజలు మరువ లేరన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గేరా లింకన్, బైరా వెంకటకోటి, సాతులూరి కోటి, ఏవీఎం సుభానీ, కల్లి వెంకటరెడ్డి, గ్రంధి ఆంజనేయులు, అల్లీమియా, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్‌కు ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలో నవశకానికి నాంది పలికి అజరామరమైన కీర్తిని వైఎస్ గడించారని ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎం రాధాకృష్ణ, ఎం.ప్రసన్న అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పుటూరి అనీల్‌కుమార్, షేక్ సలాం, నజీరుద్దీన్, పాతూరి కోటేశ్వరరావు, షేక్ బాజీ, మద్దాలి శ్రీనివాసరావు, భవానీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శావల్యాపురం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైసీపీ మండల కన్వీనర్ బీమని అంకారావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ జన్మదిన కేకును కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ అంకారావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ పోతురాజు, మండల కోఆప్షన్ మెంబర్ హుస్సేన్, మాజీ సర్పంచ్ ఐరామ్మూర్తి, గ్రామపార్టీ అధ్యక్షుడు వీరనారాయణ, వైసీపీ నేతలు ఎరుకలరెడ్డి, పొట్టిపాటి శ్రీను కొండారెడ్డి, ముట్లూరి సత్యం, ఈశ్వరయ్య, ఏసురాజు, డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్, జూలై 8: దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరెడ్డి 75వ జయంతి వేడుకలను స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజశేఖరెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను గుర్చి కొనియాడారు. ఆదేవిదంగా యోగి వేమారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్య మంత్రి రాజశేఖరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధాకరెడ్డి, మూలె వెంకటేశ్వరెడ్డి, ములకా రామతుసిరెడ్డి, గంధం బాలిరెడ్డి, రామకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి, సోము వెంకటేశ్వరెడ్డి, పాతిమారెడ్డి, రవీంద్రరెడ్డి, జయరామిరెడ్డి, బలరామిరెడ్డి , ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

నరసరావుపేట లీగల్, జూలై 8: పట్టణంలోని పాతూరుకు చెందిన జమ్ముల శ్రీనివాసరావుపై అదే ప్రాంతానికి చెందిన శీలం సుధీర్, జగదీష్, మరికొందరు హత్యాయత్నానికి వడిగట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 15న స్వల్ప వివాదం నేపథ్యంలో పాతూరులో ఇద్దరు నిందితులు మరికొందరితో కలసి తనను కత్తితో పొడిచి హత్యాయత్నానికి వడిగట్టినట్టు వైద్యశాలలో చికిత్స చేయించుకొని ప్రస్తుతం ఫిర్యాదు చేసినట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి సత్యశ్రీ

ద్విచక్ర వాహన ప్రయాణికులు హెల్మెట్ ధరించాలి

● అదనపు జిల్లా జడ్జి సత్యశ్రీ

నరసరావుపేట లీగల్, జూలై 8: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని 13వ అదనపు జిల్లా జడ్జి ఎన్ సత్యశ్రీ సోమవారం కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నూతనంగా ఈ అంశానికి సంబంధించి ఉన్న నిబంధనలను వివరించారు. ద్విచక్ర వాహన దారులు, వారి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే జరిమానాలు కూడా చట్ట ప్రకారం విధిస్తామన్నారు. ఈ నెల మొత్తం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పూర్ణిమ, ఆశీర్వాదం పాల్, ప్రవల్లిక, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రావ్య, న్యాయవాద సంఘ ఉపాధ్యక్షురాలు అమూల్య, ట్రాఫిక్ ఎస్ఐ వేణు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, జూలై 8: మండలంలోని గణపవరం సెలక్షన్‌లో కొత్త లైన్‌ల మరమ్మతుల కారణంగా చిలకలూరిపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ రోడ్డు, శాంతి నగర్, ముస్లిం బజారు, వడ్డెర కాలనీ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

పల్నాడులో శాంతి నెలకొల్పాలని ప్రజా సంఘాల డిమాండ్

నరసరావుపేట టౌన్, జూలై 8: ఎన్నికల అనంతరం పల్నాడులో హింసా, దౌర్జన్యాలు అధికం అయ్యాయని, పల్నాడు పల్లెలలో శాంతి నెలకొల్పి బాధిత ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, వీ పేరయ్య, కోలా నవజ్యోతి, పీడీఎం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కంబాల ఏడుకొండలు, విజయకుమార్, వి.వెంకట తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

నరసరావుపేట టౌన్, జూలై 8: స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏపూరి గోపాలరావు, ఎస్ ఆంజనేయనాయక్, సరికొండ వెంకటేశ్వరరాజు, పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గార్గ్

ప్రజా వేదికకు వెల్లువెత్తిన ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, జూలై 8: నిమ్మతోటకు చెందిన ఓ ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకుడు తనకు 2019లో ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఇప్పిస్తానని చెప్పి ఫైలును తీసుకున్నాడని, ఇంతవరకు సదరు ఫండ్‌ను ఇప్పించ లేదని మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన కాట్ల శిరీష ఎస్పీకి ఫిర్యాదు చేసింది. పట్టణంలోని బరంపేటకు చెందిన ఐ శ్రీనివాసరెడ్డి తనకు సంబంధించిన ఇంటిని అద్దెకు తీసుకున్న వారు అద్దె ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పెదచెరువుకు చెందిన లక్ష్మీ కోటమ్మ పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టు ఆమె సహచర ఉద్యోగి స్వప్న ప్రియకు రూ.20 లక్షలు అప్పు ఇవ్వగా, అనంతరం సదరు డబ్బును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేసింది. అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి చెందిన అంబటి నరసింహారావు అనే రైతు రైతుల వద్ద నుంచి రూ 1.42 కోట్ల మిర్చిని కొనుగోలు చేసి సదరు మిర్చిని గుంటూరుకు చెందిన లక్ష్మీశెట్టి రవికుమార్‌కు అమ్మాడని, రూ 90 లక్షలు నగదు ఇచ్చి మిగిలిన డబ్బును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. కాగా 2022 డిసెంబరు 20న తన తండ్రి షేక్ ఇబ్రహీంను మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు సుభానీ, ఖాజావలి, పెద బుజ్జీలు హత్య చేశారని ప్రత్యేక సాక్షులు తెలిపినా వారిపై చర్యలు తీసుకోలేదని, తగు చర్యలు తీసుకోవాలని షేక్ బాజీ, బషీరున్‌లు ఫిర్యాదు చేశారు. కాగా పట్టణానికి చెందిన ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ రాష్ట్ర వైసీపీ కార్యదర్శి కాకుమాను సదాశివారెడ్డిపై బ్యాంక్ ఉద్యోగి వడ్లమూడి నరసింహారావు ఫిర్యాదు చేశారు. సదాశివరెడ్డి తన వద్ద కారు కొనుగోలు చేశాడని, దానికి సంబంధించి రూ.7లక్షలు చెల్లించకుండా మోసగించాడని ఎస్పీని ఆశ్రయించాడు. కార్యక్రమంలో ఆర్ఐలు, సీఐలు, అదనపు ఎస్పీలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల పాదయాత్రకు టీడీపీ నాయకుల సంఘీభావం

శావల్యాపురం, జూలై 8: ఎన్నికలలో కూటమి ఘన విజయాన్ని సాధించిన సందర్భంగా శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి ఆధ్వర్యంలో వేల్పూరుకు చెందిన 30మంది తెలుగు మహిళలు వేల్పూరు నుంచి తిరుమల-తిరుపతి దేవస్థానానికి కాలినడకన వెళ్ళి వెంకటేశ్వరస్వామికి మొక్కుబడులు తీర్చుకొనేందుకు గత శనివారం పాదయాత్రను చేపట్టారు. పాదయాత్ర సోమవారానికి ఒంగోలు సమీపానికి చేరుకోగా మండల టీడీపీ నాయకులు మహిళలతో కలసి కొంత దూరం పాదయాత్రలో పాల్గొని వారికి సంఘీబావం తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు మహిళల పాదయాత్ర దిగ్విజయంగా పూర్తిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై మహిళలు చూపుతున్న ఆదరణ మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వేల్పూరు మాజీ సర్పంచ్ బొల్లా శివపార్వతి, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గడిపూడి విశ్వనాధం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, పల్నాడు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య, యువనాయకులు బోడెపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ, జూలై 8: టీడీపీ విజయం సాధించిన సందర్భంగా నూజండ్ల మండల పార్టీ అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన కోటప్పకొండ పాదయాత్ర వినుకొండకు చేరుకున్న సందర్భంగా వినుకొండలోని లక్ష్మీనరసింహస్వామి సేవకులు జాజుల మాల్యాద్రి సోమవారం మారెళి కృష్ణ యాదవ్‌తో పాటు, తలార్లపల్లి టీడీపీ నాయకులను దుశాలవాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.



ప్రత్తిపాటిని కలిసి సత్కరిస్తున్న జనసేన నాయకులు

కూటమి స్ఫూర్తి క్షేత్ర స్థాయిలోను ప్రతిఫలించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 8: టీడీపీ, జనసేన పార్టీ అధినేతల కూటమి సమన్వయ స్ఫూర్తి క్షేత్ర స్థాయిలోను ప్రతిఫలించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. టీడీపీ, జనసేన మైత్రిని విడదీయాలని, స్నేహ బంధంలో చిచ్చు పెట్టాలని పన్నాగాలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. అటువంటి వారి వలలో ఎవ్వరూ చిక్కుకోవద్దన్నారు. రాష్ట్ర విశాల ప్రయోజనాల కోసం పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరువలె దిగువస్థాయి నాయకులు కూడా అదే బాటలో సాగాలని కోరారు. జనసేన పార్టీకి చెందిన పలువురు రాష్ట్ర నాయకులు సోమవారం ఇక్కడి ప్రత్తిపాటి నివాసానికి విచ్చేసి ఆయనను మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. వారిలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ చిలకలూరిపేట సమన్వయ కర్త తోట రాజా రమేష్ ఉన్నారు. నియోజక వర్గంలో రెండు పార్టీల సమన్వయం గురించి ఆయనతో చర్చించారు.

వివిధ సమస్యలపై రాజకీయేతర ఐకాస వినతి

చిలకలూరిపేట అర్బన్, జూలై 8: రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం గీటురాయిగా పెట్టుకొని పనిచేస్తుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రధాన ప్రతిపక్షం ఉనికే లేకుండాపోయిన తరుణంలో ఆ బాధ్యత కూడా తమ భుజ స్కందాలపై వేసుకొని ప్రజల గరిష్ట సంతృప్త స్థాయిలే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యంత్రాంగాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు. సోమవారం చిలకలూరిపేట రాజకీయేతర ఐకాస ఆధ్వర్యంలో ప్రత్తిపాటిని కలసి వివిధ సమస్యలపై మెమోరాండం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ సమస్యలపై పరిశీలించి తగిన న్యాయం చేస్తామని ప్రత్తిపాటి వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందనతో ఐకాసా ప్రతినిధులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కాగా చిలకలూరిపేటకు చెందిన ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రత్తిపాటి వారితో మాట్లాడి ఆర్టీసీ అభివృద్ధి, సిబ్బంది సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తగ్గనున్న పత్తి సాగు: ధరలు పలికే వాటికే మొగ్గు

నాదెండ్ల, జూలై 8 : ఈ ఏడాది మండలంలో పత్తి సాగు తగ్గనుండగా పొగాకు, కంది, శనగ లాంటి అపరాల పంటల సాగు పెరగనున్నది. మొత్తం మండలంలో రైతులు సుమారు పదివేల హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాలు ఓ మోస్తరుగానే కురిశాయి. గత ఏడాది 2400 హెక్టార్లలో పత్తిని సాగుచేయగా ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు వెయ్యి హెక్టార్లలో మాత్రమే విత్తనాలను నాటారు. మిర్చిసాగు గత ఏడాది సుమారు రెండువేల హెక్టార్లలో చేయగా ఈ ఏడాది సాగర్‌కు వచ్చే నీటిని బట్టే సాగు చేపట్టే అవకాశం ఉంది. గత ఏడాదికి మించి మిర్చి సాగు పెరిగే పరిస్థితి కన్పించటం లేదు. కాగా గత ఏడాది సుమారు మూడు వందల హెక్టార్లలో పొగాకు సాగు చేపట్టారు. పొగాకు అధిక దిగుబడులు రావటంతో పాటు ఇప్పటికి రైతులకు మంచి ధర లభిస్తున్నది. మార్కెట్‌లో క్వింటాకు రూ.15వేలు ధర లభించటంతో అధిక విస్తీర్ణంలో పొగాకు సాగును చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. శనగ, కంది పంటలకు మంచిధర ఉండటంతో ఆ పంటల సాగుకూడా అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ప్రధానంగా ధరలు ఎక్కువగా ఉన్న పంటలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ యడ్లపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటరమణ

యడ్లపాడు, జూలై 8: మండల కేంద్రమైన యడ్లపాడు ఎర్ర చెరువులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మిషన్ శక్తి కార్యక్రమంపై బాల బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఈవో నాగరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ యడ్లపాడు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణ, సొలస సెక్టార్ సూపర్‌వైజర్ జోజమ్మలు పాల్గొని బాలల హక్కులు, చట్టం వారికి కల్పిస్తున్న రక్షణ గురించి వివరించారు. ప్రధానంగా బాల్య వివాహాలు వలన కలిగే నష్టం, వ్యక్తిగత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈవో - 2

నాదెండ్ల, జూలై 8: మండలంలోని చిరుమామిళ్లలోని నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో - 2 కృష్ణారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. వంట గదితోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పచ్చిరొట్ట పైర్లతో నేల సారవంతం : డీపీఎం అమలకుమారి



సొలసలో జొన్న పైరును పరిశీలిస్తున్న వెంకట్రావు, డీపీఎం అమలకుమారి తదితరులు

సొలస (యడ్లపాడు), జూలై 8: పచ్చిరొట్ట పైర్లతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి అన్నారు. యడ్లపాడు మండలం సొలసలో 30రకాల విత్తనాలతో సాగుచేస్తున్న మిశ్రమ పచ్చిరొట్ట పైర్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని రైతులు ఈ ఏడాది 22వేల ఎకరాల్లో మిశ్రమ పచ్చి రొట్ట పైర్లను సాగు చేశారన్నారు. ప్రత్తి, మిర్చి తదితర ప్రధాన పంటలను సాగుచేయబోయేముందు పచ్చిరొట్ట పంటను సాగుచేసి భూమిలో కలియదున్నడం వలన భూమికి మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయన్నారు. రైతుకు మంచి ఫలసాయంతోపాటు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గడంతోపాటు పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయన్నారు. భూమి నీరు నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వెంకట్రావు థీమాటిక్ లీడ్ గోపిచంద్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహల నిరోధంపై అవగాహన

వినుకొండ జూలై 8: మండలంలోని ఉప్పరపాలెంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహల నిరోధంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిషన్ శక్తి, బేటీ బచావో- బేటీ పడావో వాల్య వివాహల నిషేధ చట్టం 2016 ను అనుసరించి 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగపిల్లలకు వివాహం చేయటం నేరమని సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి అన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాల్య వివాహలపై వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి. యలమంద, అంగన్ వాడీ కార్యకర్త సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో తనిఖీ

వినుకొండ. జూలై 08: పట్టణంలోని ప్రాథమిక, జిల్లా పరిశత్ ఉర్దూ పాఠశాలలను సమగ్ర శిక్ష అసిస్టెంట్ రాష్ట్ర ఐఈడీ కోఆర్డినేటర్ జి. మల్లిఖార్జున, జిల్లా అసిస్టెంట్ ఐఈడీ కోఆర్డినేటర్ ఆర్ సిల్వర్‌రాజ్ సోమవారం తనిఖీచేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి జఫ్రుల్లా, లక్ష్మీ ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.